# క్యాన్సర్‌కు కళ్లెం వేయాలని..!

- ఇంటింటా నిర్ధారణ పరీక్షలు
- 18 ఏళ్లు నిండిన వారికి స్క్రీనింగ్ టెస్టులు
- మండలంలో జోరుగా సర్వే

క్యాన్సర్.. ఈ పేరు వింటేనే కాళ్లు చేతులు వణుకుతాయి.. ప్రాణాంతకమైన ఈ మహమ్మారికి కళ్లెం వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. చాపకింద నీరులా విస్తరించే ఈ క్యాన్సర్‌ను ఆలస్యంగా గుర్తించడం వల్ల మరణాలు చోటు చేసుకుంటాయని వైద్యులు చెబుతున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య శాఖ సర్వే ప్రకారం క్యాన్సర్ మరణాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. ఈ క్యాన్సర్‌కు చెక్ చెప్పాలనే ఉద్దేశంతో గత నెల 14 నుంచి క్యాన్సర్‌పై విజయం–స్క్రీనింగ్ సాధ్యం అనే పేరుతో ఇంటింటి పరీక్షలు ప్రారంభించారు. ఇంటి వద్దే 18 ఏళ్లు నిండిన వారికి స్థానిక ఆరోగ్య సిబ్బంది ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీని కోసం వైద్య ఆరోగ్య శాఖాధికారులు ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించారు.

– పెదగంట్యాడ


శీరవానిపాలెంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

## ప్రత్యేక యాప్‌లో నమోదు

క్యాన్సర్ లక్షణాలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఒక ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చింది. పరీక్షలకు సంబంధించిన వ్యక్తుల వివరాలను అందులో నమోదు చేస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరి అనారోగ్య సమస్యలను తెలుసుకోవడంతో పాటు వారి ఆహారపు అలవాట్లను తెలుసుకుంటున్నారు. అంతే కాకుండా యాప్‌లో పొందుపర్చిన పలు రకాలకు సంబంధించిన వివరాలు నమోదు చేస్తున్నారు. కుటుంబంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పరీక్షలు చేసి, 30 ఏళ్లు నిండిన మహిళలకు అనారోగ్య సమస్యలు, నెలసరి వివరాలు, దంతక్షయాలు, మహిళల్లో గర్భాశయ ముఖ ద్వారా, రొమ్ము క్యాన్సర్ వంటి సమస్యలను తెలుసుకుని నమోదు చేస్తున్నారు. అవసరమైన వారికి తదుపరి పరీక్షలు చేస్తున్నారు. వీటితో పాటు బీపీ, సుగర్, హిమోగ్లోబిన్ వంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

## రోగ నిర్ధారణ ఇలా..

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5 ప్రకారం క్యాన్సర్‌ను ఆలస్యంగా గుర్తించడంతో మరణాలు సంభవిస్తున్నట్టు పలు నివేదికలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కోవాలంటే ముందుగా నిర్ధారణ పరీక్షలు చేయాలని.. తద్వారా మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చును అని వైద్యులు చెబుతున్నారు. ఒక వ్యక్తిలో ఏదైనా ఒక లక్షణం కనిపించక ముందే క్యాన్సర్ కణాల కోసం వెతకడాన్నే క్యాన్సర్ స్క్రీనింగ్ అని పిలుస్తారని తెలిపారు.

## గుర్తించడం ఎలా..

మానకుండా ఉన్న పుండ్లు, శరీరంలో ఏ భాగంలోనైనా ఎదుగుతున్న గడ్డలు, కణితులు, అసహజమైన రక్తస్రావం, పెరుగుతున్న పుట్టు మచ్చలు, పులిపురి కాయలు, మింగడం కష్టంగా ఉండడం, గొంతు బొంగురుపోయి తగ్గకుండా ఉండడం, చాలా రోజులుగా బాధిస్తున్న అజీర్ణ వ్యాధి లక్షణాలు ఉంటే తక్షణమే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

## 5 వేల మందికి పరీక్షలు



పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇప్పటి వరకూ 15 సచివాలయాల పరిధిలో 5 వేల మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశాం. ఇప్పటి వరకూ ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. 18 నుంచి 30 ఏళ్లు నిండిన వారందరికీ ఈ పరీక్షలు చేస్తున్నాం. కేంద్రం పరిధిలో మొత్తం 64వేల మందికి పరీక్షలు నిర్వహించనున్నాం. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో ముందస్తుగా క్యాన్సర్ లక్షణాలను గుర్తించవచ్చు. దానికి చికిత్స అందించవచ్చు. తద్వారా క్యాన్సర్ మరణాలను తగ్గించవచ్చు.

– డాక్టర్ రమేష్‌బాబు, వైద్యాధికారి, పెదగంట్యాడ పీహెచ్‌సీ

## సిబ్బందికి శిక్షణ ఇచ్చాం



పరీక్షలకు సంబంధించి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. పరీక్షల సమాచారాన్ని యాప్‌లో నమోదు చేస్తున్నాం. సర్వేను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు సంబంధించి అందరూ సహకరించాలి. గంగవరం పరిధిలో సుమారు 14వేల మంది జనాభా ఉన్నారు వారిలో ఇప్పటి వరకు 800 మంది వరకు సర్వే నిర్వహించాం. సర్వే పై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దు. మహిళలు ఎక్కువగా గర్భాశయ, రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ పరీక్షలతో సత్ఫలితాలు పొందవచ్చు. ఈ సర్వే 9 నెలలు పాటు కొనసాగుతుంది.

– డాక్టర్ హేమలత, వైద్యాధికారి, యూపీహెచ్‌సీ, గంగవరం

## క్లుప్తంగా

### అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి: అంబేడ్కర్ ఆశయాలు అనుసరణీయమని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రమశక్తి అవార్డు గ్రహీత డొక్కా రమేష్ అగనంపూడి హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, నాయకులు కర్రి దేవేంద్ర, ఇల్లపు ప్రసాద్, అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ, బండారు చందు, పైడిరత్నం పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు మంగళపాలెంలోని 33కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. అగనంపూడి సెక్షన్ కార్యాలయం పరిధిలోని అగనంపూడి, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎంకాలనీ, మంగళపాలెం, దువ్వాడ సెక్టార్–1, వెదుళ్లనరవ, గంగవరం, నంగినారపాడు, అజనగిరి, శెట్టివానిపాలెం, కొత్తూరు, లక్కరాజుపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం


అగ్నికి ఆహుతైన మంచం, ఇతర సామగ్రి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం రైల్వే ట్రాక్ పక్కన నివాసాల్లో ఓ పూరిల్లు కాలిపోయింది. షార్ట్ సర్క్యూట్ వల్ల మీటర్ నుంచి అగ్గిరవ్వలు రాలడంతో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఇంట్లో మంచానికే పరిమితమైన వ్యక్తిని బయటకు తీసుకురావటంతో ఆయనకు ప్రమాదం తప్పింది. ఇంట్లో సామన్లు, మంచం, పరుపు, దుస్తులు, కరెంట్ మీటర్ కాలిపోయాయని ఇంటి యజమాని బంగారు దుర్గారావు తెలిపారు. వీఆర్వో దినేష్ వివరాలు సేకరించారు. నిరాశ్రయులైన బంగారు దుర్గారావు కుటుంబానికి వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి నిత్యావసర సరకులు అందజేశారు.

### 10 నుంచి బీహెచ్‌పీవీ విశ్రాంత ఉద్యోగుల క్రికెట్ టోర్నీ



లోగోను ఆవిష్కరిస్తున్న హార్ట్ ఫుల్ ఫ్రెండ్స్ జబర్దస్త్ రమేష్, రాము, శ్రీనుబాబు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ విశ్రాంత ఉద్యోగుల పిల్లల క్రికెట్ టోర్నమెంట్‌ను ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు భెల్ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు హార్ట్ ఫుల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రాము, రవిశంకర్ తెలిపారు. శనివారం టోర్నమెంట్ లోగోను జబర్దస్త్ నటుడు, డ్యాన్సర్ చదలవాడ రమేష్ బాబు, జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ఆవిష్కరించారు. క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు నాని బాబు, పసుపులేటి శ్రీనివాస్, ఆనంద్ సుబేదారు, కృష్ణారెడ్డి, కృపానంద పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం


క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న సీఐ పార్థసారథి

గాజువాక: విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గడంతో పాటు సత్ప్రవర్తన, క్రమశిక్షణ అలవడుతుందని సీఐ పార్థసారథి అన్నారు. స్థానిక యాపిల్ ఐ స్కూల్‌లో శనివారం నిర్వహించిన వార్షిక క్రీడా దినోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. క్రీడల్లో రాణించిన వారికి మంచి భవిష్యత్తు కూడా ఉంటుందన్నారు. అనంతరం నిర్వహించిన పిరమిడ్ విన్యాసాలు, 100 మీటర్లు, 200 మీటర్లు రిలే పరుగు తదితర క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు పాఠశాల చైర్మన్ టి.బలరామకృష్ణ, కరస్పాండెంట్ టి.ఉమామహేశ్వరరావు బహుమతులు అందజేశారు.

## వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం


కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం కోదండ రామాలయ ప్రాంగణంలోని వల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్య ఆలయంలో సుబ్రహ్మణ్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌కుక్షీరాభిషేకం, పంచమృతాభిషేకం నిర్వహించారు. దేవతా మూర్తులను అలంకరించి కల్యాణం కమనీయంగా జరిపారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కుటుంబ సభ్యులు బాలభాస్కరావు, ప్రకాష్ పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వరా..పాహిమాం


పూజలు చేస్తున్న అర్చకుడు వాసుదేవశర్మ, భక్తులు


సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: మండలంలోని పలు ఆలయాల్లో సుబ్రహ్మణ్యషష్ఠి పురస్కరించుకుని శనివారం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించేందుకు భక్తులు తరలి రావడంతో పలు ఆలయాలు కిటకిటలాడాయి. జీవీఎంసీ 76వ వార్డు పరిధి బాలచెరువు ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి.. ఆలయ అర్చకుడు వాసుదేవశర్మ భక్తుల చేతుల మీదుగా పూజలు నిర్వహించారు.

- జీవీఎంసీ 74వ వార్డు వెంపళ్లనగర్‌లో వేంచేసియున్న నూకాంబిక అమ్మవారి ఆలయ ఆవరణలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గల్లా శంకర్ సాయిరాం ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

ఉక్కునగరం: స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం సుబ్రహ్మణ్య స్వామి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెక్టార్–5 మరిడిమాంబ ఆలయం నుంచి పాల కావిడి ఉత్సవం ప్రారంభం అయింది. అయ్యప్ప స్వాములు పాల కావిళ్లతో సెక్టార్–9 కాలభైరవి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు నాగేశ్వరశర్మ పూజలు చేయించారు.


ఉక్కునగరంలో పాలకావిడి ఉత్సవంలో అయ్యప్ప భక్తులు


ఉక్కు బీసీ గేటు శివాలయంలో కల్యాణం

- ఉక్కు బీసీ గేటు శివాలయంలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రు నాయక్, ఎల్లేటి శ్రీనివాస్, సుధాకర్ శర్మ, సురేంద్ర, నడుపూరు శ్రీనివాస్, రాధాకృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.
- స్టీల్‌ప్లాంట్ రవీరేస్ బంక్ సమీప శివాలయంలో సుబ్రహ్మణ్య స్వామికి విశేషపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు.

## పరిమళించిన మానవత్వం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐఎస్‌ఎఫ్ సీనియర్ కమాండెంట్ అత్తార్ హమ్మద్ హనీఫ్ భార్య తబస్సుం హనీఫ్ దివ్యాంగ విద్యార్థికి చేయూత అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. నవంబర్ 14న బాలల దినోత్సవం సందర్భంగా సీనియర్ కమాండెంట్ హనీఫ్, ఆయన భార్య తబస్సుం అచ్యుతాపురంలోని ఇంటిగ్రేటెడ్ దివ్యాంగుల ఆశ్రమాన్ని సందర్శించారు.అక్కడ ఉన్న ఆరో తరగతి విద్యార్థి కార్తీక్ తో సంభాషించడానికి ప్రయత్నించారు. కార్తీక్ పుట్టుక నుంచి చెవుడు కలిగి ఉన్నాడని నిర్వాహకులు తెలిపారు. చలించిన తబస్సుం నగరంలోని పలు ఆస్పత్రులకు తీసుకువెళ్లి ఆపరేషన్ చేయించడానికి ప్రయత్నించారు. అయితే కార్తీక్‌కు ఆపరేషన్ ద్వారా వినికిడి రాదని వైద్యులు తేల్చి చెప్పారు. చివరకు వైద్యుల సూచనల మేరకు హియరింగ్ ఎయిడ్‌ను ఆమె కొనుగోలు చేసి శనివారం సీఐఎస్‌ఎఫ్ కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో కార్తీక్‌కు అందజేశారు. కార్తీక్ తల్లితో పాటు అమ్మమ్మను సత్కరించారు. కార్యక్రమంలో సీఐఎస్‌ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.


దివ్యాంగ బాలుడు కార్తీక్ తల్లితో పాటు అమ్మమ్మను సత్కరిస్తున్న తబస్సుం హనీఫ్

## శ్రీవారికి సహస్ర నామార్చన

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశునికి సహస్రనామార్చన నిర్వహించారు. తోమాల సేవకు భక్తులు రకారకాల పుష్పాలతో ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.


పుష్పాలతో భక్తులు

## క్రమశిక్షణతోనే బంగారు భవిష్యత్తు

డిప్యూటీ కలెక్టర్ మాధవి

పెదగంట్యాడ: క్రమ శిక్షణతో చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధవి అన్నారు. స్థానిక నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశంలో ఆమె ప్రసంగించారు. విద్యార్థుల భవిష్యత్తు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని చెప్పారు. పిల్లలు వారికి నచ్చిన రంగంలో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలని కోరారు. సైబర్ క్రైం సీఐ బీఎండీ ప్రసాద్ మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులపై అవగాహన కల్పించారు.

- నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, ఎంఈవోలు శ్రీనివాస్, రమణాజీ, నాయకుడు కిల్లాన ముసలయ్య పాల్గొన్నారు.

గాజువాక: గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మీట్‌ను 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విజయ ప్రశాంతి, తహసీల్దార్ టి.శ్రీవల్లి, గాజువాక సీఐ పార్థసారథి పాల్గొన్నారు.

- 70వ వార్డులోని డ్రైవర్స్ కాలనీ, శ్రామికనగర్, చట్టివానిపాలెం ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు పాల్గొన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కొణతాల రాము, బుజ్జి, కె.ఎస్.నాయుడు, బాబులునాయుడు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా ఆత్మీయ సమావేశం

అగనంపూడి: విద్యార్థుల చదువులు, క్రమశిక్షణ, ప్రవర్తన వంటి అంశాలను తల్లిదండ్రులకు వివరించాలనే ఆలోచనతో ఆత్మీయ కలయిక నిర్వహించినట్టు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు.అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పేరెంట్స్ టీచర్స్ మెగా మీట్ కార్యక్రమంలో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధవి


గాజువాక హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు వేసిన ముగ్గులు


అగనంపూడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

- లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు పాల్గొన్నారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, పురుషులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు.
- 87వ వార్డు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం పండగ వాతావరణంలో జరిపించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొండా జగన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐ సీహెచ్.మల్లేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం సూర్య ప్రకాశరావు పాల్గొన్నారు.
- 86వ వార్డు పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్ పాల్గొని హోలిస్టిక్స్ ప్రొగ్రెస్ కార్డులు అందించారు.


మింది జెడ్పీ హై స్కూల్లో మనబడి బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ గుడివాడ అనూష


చట్టివానిపాలెం పాఠశాలలో తల్లిదండ్రులకు బహుమతులు అందజేస్తున్న చందు

అక్కిరెడ్డిపాలెం:టీచర్స్ – పేరెంట్స్ డేను 68వ వార్డు మింది, అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హై స్కూల్స్‌లో ఘనంగా నిర్వహించారు. మింది జిల్లా పరిషత్ హైస్కూల్లో పాఠశాల హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్. ఆంజనేయ పాఠశాలలో సౌకర్యాలను వివరించారు. కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పర్చాలని కోరారు.

- అక్కిరెడ్డిపాలెం హైస్కూల్లో జరిగిన కార్యక్రమాలను గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి పాఠశాల హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతంతో కలిసి పర్యవేక్షించారు. విద్యార్థులు గీసిన చిత్రాలను పరిశీలించారు. పాఠశాల ఎదురుగా ఉన్న మైదానం పాఠశాల అవసరాలకు కేటాయించాలని హెచ్‌ఎం కాంతం, పీడీ ఇస్మాయిల్ తహసీల్దార్‌ను కోరారు


అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్లో టగ్ ఆఫ్ వార్ పోటీలు


తల్లిదండ్రులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం


అబ్బురపర్చిన విద్యార్థుల యోగాసన ప్రదర్శన


లంకెలపాలెం హైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న పోలీస్ అధికారులు, విద్యార్థులు

## ఇదెక్కడి విడ్డూరం!

అగనంపూడి: ఆర్టీఐ పౌర సమాచార అధికారి లేరనే నెపంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యాలయానికి రాసిన లేఖను వెనక్కి పంపడం విడ్డూరంగా ఉందని ఆర్టీఐ కార్యకర్త పట్టా రామఅప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. అగనంపూడిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం కార్యాలయం వెనక్కి పంపిన లేఖను ప్రదర్శించారు. రామఅప్పారావు మాట్లాడుతూ ఉక్కు అధికారి నాగ్ర తాతారావు మరణం వెనుక మిస్టరీని తేల్చాలని పవన్ కల్యాణ్‌కు గతంలో ఫిర్యాదు చేశామన్నారు. దానిపై ఏం చర్యలు తీసుకున్నారో కోరుతూ లేఖ రాస్తే.. సమాధానం చెప్పకుండా లేఖను తిరిగి పంపించారని ఆరోపించారు. ఇదెక్కడి విడ్డూరమన్నారు.


లేఖను ప్రదర్శిస్తున్న రామ అప్పారావు

## నడిరోడ్డుపై విద్యార్థుల ఘర్షణ


ఘర్షణ పడుతున్న విద్యార్థులు

గాజువాక: గాజువాకలోని ఒక ప్రైవేట్ కళాశాలకు చెందిన విద్యార్థులు రోడ్డుపై ఘర్షణకు దిగారు. విద్యార్థులు రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. వారిని వారించడానికి అక్కడే ఉన్న కొంతమంది ప్రయత్నించినప్పటికీ విద్యార్థులు వెనక్కి తగ్గలేదు. చాలా సేపటి తర్వాత గొడవ సద్దుమణగడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘర్షణ అంతా ఓ యువతి కోసం జరిగినట్టు చెబుతున్నారు. విద్యార్థుల్లో పరివర్తన తీసుకురావడానికి పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా కొంత మందిలో మార్పు రావడం లేదని పేర్కొంటున్నారు.